# భాషా శాస్త్రవేత్త శ్రీ భద్రిరాజుకు బాష్పాంజలి!

టీవీయస్. శాస్త్రి



ప్రపంచఖ్యాతి గడించిన భాషా శాస్త్రవేత్త, ప్రముఖ విద్యాకోవిదుడు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి (84) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం తెల్లవారుజామున (11-08-2012) మెడిసిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో తెలుగు, ద్రవిడ భాషా శాస్త్ర పరిశోధనా రంగంలో ఒక శకం ముగిసింది. భద్రిరాజు మరణవార్త తెలియగానే సాహితీవేత్తలు, కవులు, రచయితలు, ప్రొఫెసర్‌లు, శిష్యులు ఆయనకు నివాళులర్పించారు. భాషాశాస్త్రంలో, ద్రవిడ భాషా రంగంలో విశ్వవిఖ్యాతి గడించిన కృష్ణమూర్తి 1928లో ఒంగోలులో భద్రిరాజు సుబ్రహ్మణ్యం, భారతమ్మ దంపతులకు జన్మించారు. ఆయనది నిరుపేద కుటుంబం. తండ్రి గుమస్తాగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. కృష్ణమూర్తి గారు చిన్న వయస్సులోనే తండ్రిని కోల్పోయారు. దీంతో ఆయన చదువుకు అంతరాయం ఏర్పడింది. ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ గంటి జోగి సోమయాజి ప్రోత్సాహంతో భద్రిరాజు చదువు ముందుకు సాగింది. 1948లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బీఏ (ఆనర్స్) పూర్తి చేశారు. 1955లో అమెరికాలోని పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ గోల్డ్ మెడల్ సాధించారు. అదే విశ్వవిద్యాలయం నుంచి 1957లో పీహెచ్‌డీ పట్టా పొందారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్యాపకులుగా, 1961-62లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు రీడర్‌గా విధులు నిర్వహించారు. 34 ఏళ్ళ వయసులోనే 1962లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మొట్టమొదట భాషాశాస్త్ర శాఖ ఏర్పడినప్పుడు దానికి అధిపతిగా పనిచేశారు. 1964లో ఆర్ట్స్

కళాశాల ప్రిన్సిపాల్‌గా, ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్‌గా సేవలందించారు. 1986 నుంచి 1993 వరకు హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీకి తొలి ఉపకులపతిగా ఏడేళ్లపాటు కొనసాగారు. కృష్ణమూర్తి గారి ప్రతిభాపాటవాలు దేశ విదేశాల్లో వ్యాప్తి చెందాయి. ప్రతిష్టాత్మక రాయల్ సొసైటీ ఆఫ్ లండన్ సభ్యుడిగా ఆయన అందించిన సేవలు మరువలేనివి. ఆస్ట్రేలియా, జపాన్‌లాంటి 10 దేశాల్లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పని చేశారు. రష్యా, జర్మనీ, ఫ్రాన్స్, కజకిస్తాన్, చైనా వంటి దేశాల్లో పర్యటించారు. దేశ విదేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో ప్రతిష్టాత్మకమైన డాక్టరేట్‌లను, సభ్యత్వాలను సొంతం చేసుకున్నారు. 1985లో లింగ్విస్టిక్స్ సొసైటీ ఆఫ్ అమెరికా గౌరవ సభ్యుడిగా గౌరవాన్ని పొందారు. 2004లో అత్యంత ప్రతిష్టాత్మకమైన 'ఎడింబరో రాయల్ సొసైటీ' వారి సత్కారాన్ని అందుకున్నారు. 2004లోనే కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును పొందారు. 2008లో హైదరాబాద్‌లోని సీపీ బ్రౌన్ అకాడమీ వారి'తెలుగుభారతి' సత్కారాన్ని కూడా పొందారు. శ్రీ వేంకటేశ్వర, ద్రవిడ విశ్వవిద్యాలయాల నుంచి డాక్టరేట్లను పొందారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకి వీరు అత్యంత సన్నిహితులు. కృష్ణమూర్తి చేసిన అనువాదాలకు, శ్రీ పీ.వీ.నరసింహారావు ఎంతో సహకరించారు. 27కు పైగా పుస్తకాలకు సంపాదకత్వం వహించిన కృష్ణమూర్తి,అంతేగాక 80కి పైగా పరిశోధన పత్రాలను కూడా సమర్పించారు.

భాషా శాస్త్రవేత్త శ్రీ భద్రిరాజు కృష్ణమూర్తిగారికి నివాళులు సమర్పిస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ణి మనసారా ప్రార్థిస్తున్నాను.